ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 వరంగల్

సోమవారం 12 ఫిబ్రవరి 2024



నిధులు తక్కువ.. నీళ్లు ఎక్కువ..

- సాగునీటిపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- బడ్జెట్‌లో ప్రాజెక్టులకు రూ.28,024 కోట్లు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు లబ్ధి
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులకు ప్రాధాన్యత

వరంగల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తక్కువ నిధులతో ఎక్కువ ఎకరాలకు సాగు నీరందించే ప్రాజెక్టుల వైపు ప్రభుత్వం దృష్టిసారిస్తోంది. తాత్కాలి క బడ్జెట్‌లో ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులకు రూ.28,024కోట్లు కేటాయించారు. అయితే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రైతాంగానికి దేవాదుల, చిన్నకాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టులు పూర్తి అయితే 4లక్షల ఎకరాలకు అదనంగా సాగునీరు అందే అవకాశం ఉంది.

దేవాదుల.. ఇక వేగిరం..

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం దేవాదుల వద్ద 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జె.చొక్కారావు ఎత్తిపోతల పథకాన్ని నిర్మించింది. కరువు పీడిత ప్రాంతాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో మూడువిడతల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని రూపకల్పన చేశారు. ప్రాజెక్టు పూర్తిచేసి 170రోజుల్లో 38.182 టీఎంసీలను లిఫ్ట్ చేయాలని, ఇందులో 2.842 టీఎంసీల నీటిని వరంగల్ నగరానికి తాగునీటికి కేటాయించాలని నిర్ణయించారు. మిగిలిన 35.34టీఎంసీల నీటిని 6.21లక్షల ఎకరాలకు సాగుకు మళ్లించటమే ఈ ప్రాజెక్టు లక్ష్యం. అయితే మొదటి, రెండోదశ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. దేవాదుల ప్రాజెక్టులో కీలకమైన మూడో దశ పనులు ముందుకు సాగటం లేదు. 2008లో మూడో దశ పనులు మొదలు పెట్టారు. 2011 డిసెంబరు 7వ తేదీ నాటికి పనులు పూర్తి కావాలి. ఈ దశలో 54.88కిలో మీటర్ల దూరం సొరంగం తవ్వాల్సి ఉంది. కానీ 2009 జూన్‌లో శాయంపేట మండలం జోగంపల్లి శివారులోని చలివాగు ప్రాజెక్టు వద్ద బుంగ పడటంతో దేవాదుల టన్నెల్‌లోకి నీళ్ల చేరి ముగ్గురు కార్మికులు జలసమాధి అయ్యారు. దీంతో రెండేళ్లకు పైగా మూడో విడత దేవాదుల పనులకు బ్రేక్ పడింది. అప్పటికే 42కిలోమీటర్ల సొరంగం తవ్వి, 53 శాతం లైనింగ్ పనులు పూర్తి చేశారు. భీంఘన్‌పూర్ నుంచి రామప్ప చెరువు మధ్యలో సొరంగం పనులు స్థానికులు అడ్డుకోటంతో 5.82కిలో మీటర్లు తగ్గించి 49.06కిలో మీటర్లకు సొరంగం పనులను కుదించారు. దీంతో ఇంకా 7కిలోమీటర్ల టన్నెల్ తవ్వి లైనింగ్ పూర్తి చేయాల్సి ఉంది. అయితే నిధులు కొరతతో దేవాదుల పనులు ముందుకు సాగటం లేదు. ఏటా బడ్జెట్‌లో అరకొరనిధులే కేటాయిస్తున్నారు. ప్రస్తుతం దేవాదుల ద్వారా వరంగల్ నగరానికి తాగునీరు అందిస్తుండటంతో పాటు సుమారు 2లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. మూడో దశ పనులు పూర్తి అయితే అదనంగా మరో 2లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. ప్రభుత్వం దేవాదుల కోసం రూ.3,687.72కోట్ల నిధులను కేటాయించింది. టన్నెల్ పనులు పూర్తి చేయటంతో పాటు ప్రాజెక్టుకు కావాల్సిన సుమారు 3వేల ఎకరాల భూమిని జనగామ, హనుమకొండ, సిద్ధిపేట జిల్లాలో భూసేకరణ చేయాల్సి ఉంది. మొత్తానికి దేవాదులపై ప్రభుత్వం దృష్టి పెట్టడంతో త్వరలోనే దేవాదుల ఫలాలు అందుతాయనే ఆశతో ఓరుగల్లు రైతాంగం ఎదురుచూస్తుంది.

చిన్న కాళేశ్వరంలో కదిలిక

భూపాలపల్లి జిల్లా కాటారం డివిజన్ పరిధిలోని చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభు త్వంలో కదిలిక వచ్చింది. 2008లో జలయజ్ఞం పథకం కింద అప్పటి సీఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించారు. రెండు పంపుహౌస్‌ల ద్వారా 4.5 టీఎంసీల గోదావరి నీటిని లిఫ్ట్ చేసి కాటారం, మహదేవపూర్, పలిమెల, మహముత్తారం, మల్హర్ మండలాల్లోని 45వేల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యం. ఇందుకోసం రూ.499కోట్ల అంచనా వ్య యంతో పనులు చేపట్టారు. బీరసాగర్, కాటారంలో రెండు చోట్ల పంపుహౌస్‌ల నిర్మాణంతో పాటు 8.5మెగా వాట్ల కెపాసిటీ గల ఏడు మోటర్లను బిగించారు. పైపులైన్, భూసేకరణతో పాటు మరికొన్ని పనుల కోసం రూ.325కోట్ల వరకు ఖర్చు చేశారు. ఆ తరువాత నిధుల కొరతతో చిన్నకాళేశ్వరం ప్రాజెక్టుకు బ్రేక్ పడింది. పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేయకపోవటం నిరుపయోగంగా మారింది. స్థానిక ఎమ్మె ల్యే, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో ప్రస్తుత బడ్జెట్‌లో రూ.283.37కోట్లు కేటాయించారు. దీంతో రాబోయే రెండేళ్లలో పనులు పూర్తి అయితే 45వేల ఎకరా లకు సాగునీరుతో పాటు సుమారు 100 గ్రామాల కు తాగునీటికి ఈ ప్రాజెక్టు ఉపయోగపడుతుం దనే ఆశతో స్థానికులు ఉన్నారు.

సీతారామకు రూ.900కోట్లు

భద్రాద్రికొత్తగూడెం జిల్లాలో గోదావరిపై నిర్మిస్తున్న సీతారామ ప్రాజెక్టుతో మహబూబా బాద్ జిల్లాలోని రైతాంగానికి ప్రయోజనం చేకూరనుంది. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలో 6.74 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.13,077కోట్ల అంచనాలతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. అయితే నిధుల కొరతతో ఐదేళ్లుగా ఈ ప్రాజెక్టు ముందుకు సాగటం లేదు. ప్రస్తుతం సీతారామ ప్రాజెక్టు కోసం అధికారులు రూ.2వేల కోట్ల కోసం ప్రతిపాదనలు పంపిస్తే, బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.900కోట్లు కేటాయించింది. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే బయ్యారం, గార్ల, డోర్నకల్ మండలాల్లో సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. అలాగే ములుగు జిల్లా వాజేడు మండలం మోడికుంట వాగు ప్రాజెక్టు, వెంకటాపురం మండలం పాలెం వాగు ప్రాజెక్టులకు పీఎం కృషి సించాయి యోజన పథకంలో అభివృద్ధి చేసే అవకాశం ఉంది.

కాళేశ్వరానికి నిధులు లేనట్టే..

గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రస్తుత బడ్జెట్‌లో పైసా నిధులు కేటాయించలేదు. భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం మేడిగడ్డ వద్ద నిర్మించిన బ్యారేజీతో 45లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే గత అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటంతో కాళేశ్వరం ఎత్తిపోతలకు బ్రేక్ పడింది. దీనిపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణ చేపట్టింది. ఈ ప్రాజెక్టు పూర్తి కావాలంటే భారీ బడ్జెట్ అవసరం. కాళేశ్వరం ప్రాజెక్టు అప్పులకే రూ.17,114కోట్లు ఖర్చు చేయాల్సి వస్తోంది. రూ.1,534కోట్లు జీతభత్యాలు, ఇతర ఖర్చులకు పోనూ, మిగిలిన రూ.9,377కోట్లతో పాత ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. దీంతో ప్రభుత్వం కాళేశ్వరం జోలికి వెళ్లకుండా తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీళ్లు అందే ప్రాజెక్టులపై దృష్టిపెట్టింది.



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మేడారంలో మొక్కుల జోరు

- సమ్మక్కసారలమ్మల దర్శనాలకు భక్తుల బారులు
- రద్దీగా మారిన మేడారం పరిసరాలు



మేడారం, ఫిబ్రవరి 11 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహాజాతర ఈనెల 21 నుంచి ప్రారంభం కానుండగా వనదేవతలకు ముందస్తుగా మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ నలమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి భారీగా తరలివచ్చారు. 10 లక్షల మందికి పైగా భక్తులు తరలివచ్చారని దేవాదాయ శాఖ ఈవో రాజేంద్రం తెలిపారు. ముందుగా జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్ట వద్ద తలనీలాలు సమర్పించారు. వనదేవతల గద్దెలకు చేరుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, చీరె, సారెలు, కొబ్బరికాయలు, నిలువెత్తు బంగారం(బెల్లం) చెల్లించుకున్నారు.

గద్దెలను తాకి పులకించి

మహా జాతరకు ముందుగా సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకోవడానికి మేడారం తరలి వచ్చే భక్తులు నేరుగా తల్లుల గద్దెలను తాకి తరించిపోతున్నారు. మహా జాతరలో అవకాశం రాకపోవచ్చని భావిస్తూ ముందస్తుగా కుటుంబ సభ్యులతో తరలివచ్చి తల్లులను దర్శించుకుంటున్నారు.

రద్దీని నియంత్రించని పోలీసులు

మహా జాతరకు ముందుగా వనదేవతలను దర్శించుకోవడానికి ఆదివారం తరలివచ్చిన భక్తజనాన్ని గద్దెల వద్ద పోలీసులు నియంత్రించలేక పోయారు. దేవాదాయ, పోలీసు శాఖల అధికారులు తమ కుటుంబ సభ్యులు, శాఖల అధికారులు, బంధువులు, మిత్రులకు ప్రత్యేక దర్శనాలు కల్పించే పనిలో పడ్డారు. సామాన్య భక్తులకు మాత్రం దర్శనాల్లో ఇబ్బందులు తప్పలేదు. వీవీఐపీ, వీఐపీల దర్శనాల కారణంగా దగ్గరకు వెళ్లలేని భక్తులు దూరం నుంచే బెల్లం, కానుకలు, ముడుపులు విసిరారు. భక్తులందరినీ సమ దృష్టిలో చూడాలని, సామాన్యులకు దర్శన భాగ్యం కల్పించాలని కోరారు.






ఈవీఎంలను పరిశీలిస్తున్న కేంద్ర పరిశీలకులు

ఈవీఎంలను పకడ్బందీగా పరిశీలించాలి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11: జిల్లాలో ఈవీఎంల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కేంద్ర ఎఫ్ఎల్‌సీ పరిశీలకులు పాండిచేరి రాష్ట్ర నోడల్ అధికారి జిల్లా పరిశీలకులు బి.తిలైవేల్ అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యతో కలిసి ఏనుమాముల మార్కెట్ ఈవీఎంల గోదాం వద్ద కొనసాగుతున్న ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవీఎంల ప్రక్రియ గురించి ఆయన ఆర్‌డీవో ఇతర అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని పరిశీలించారు. ఎఫ్ఎల్‌సీను క్షుణ్ణంగా పరిశీలించాలని ఈసీఐఎల్ ఇంజనీర్లకు సూచించారు. కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య, ఆర్‌డీవో వాసుచంద్ర, ఎన్నికల పర్యవేక్షకులు రమేష్, నాయబ్ తహసీల్దార్లు అనీఫ్, రంజిత్, రాజకీయ పార్టీల ప్రతినిధులు అనిల్‌కుమార్, రాజేష్, వసీమ్, ఈసీఐ ఇంజనీర్లు ఎన్నికల విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

పాకాలలో ముగిసిన బర్డ్ వాక్



బర్డ్ ఫొటోగ్రాఫర్లతో రిటైర్డ్ డీసీఎఫ్ పురుషోత్తం, నాగేశ్వరరావు

ఖానాపురం, ఫిబ్రవరి 11: పాకాలలో నిర్వహించిన బర్డ్‌వాక్ కార్యక్రమం ఆదివారం ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన బర్డింగ్ పాల్స్ ఆధ్వర్యంలో 450వ బర్డ్‌వాక్ కార్యక్రమాన్ని పాకాలలో శని, ఆదివారాల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 60మంది బర్డ్ ఫొటోగ్రాఫర్లు, పక్షి ప్రేమికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాకాల అభయారణ్యం, బయోడైవర్సిటీ పార్క్, నర్సంపేట, మహబూబాబాద్ రేంజ్ పరిధిలో విహరించే వివిధ రకాల పక్షుల దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు. బర్డ్‌వాక్ ముగింపు కార్యక్రమానికి రిటైర్డ్ డీసీఎఫ్ పురుషోత్తం, ఓరుగల్లు వైల్డ్‌లైఫ్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఇందారపు నాగేశ్వర్‌రావు, సీనియర్ బర్డ్ ఫొటోగ్రాఫర్ పన్నాల జగన్ ముఖ్యఅతిథులుగా హాజరై ఫొటోగ్రఫి కాంపిటీషన్‌లో విజేతలుగా నిలిచిన వారికి సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాకాలలో సుమారు 150 రకాల పక్షులను గుర్తించగా, వాటిలో మూడు, నాలుగు కొత్త పక్షులను గుర్తించినట్లు తెలిపారు. అలాగే బర్డ్‌వాక్ కార్యక్రమానికి సహకరించిన వరంగల్, మహబూబాబాద్ డీఎఫ్‌వోలు అర్పణ, రవికిరణ్, ఎఫ్‌డీవో చంద్రశేఖర్‌లకు హైదరాబాద్ బర్డ్‌పాల్స్ సొసైటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్లు శ్రీరాంరెడ్డి, క్రిష్ణ, రవి, కళ్యాణ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను మింగిన చెరువులు

భూపాలపల్లి, మానుకోట జిల్లాల్లో విషాదం

- వేర్వేరు ప్రాంతాల్లో నలుగురి మృతి
- మల్హర్‌లో మేకలను మేపడానికి వెళ్లి ఇద్దరు అన్నదమ్ములు..
- అమ్మాపురంలో ఈతకు వెళ్లిన ఇద్దరు స్నేహితులు మృత్యువాత



తాడిచర్లలో చిన్నారుల మృతదేహాలు (ఇన్‌సెట్‌లో ఫైల్)



అమ్మాపురం గ్రామ చెరువులో పడి మృతి చెందిన చిన్నారులు

మల్హర్/తొర్రూరు రూరల్, ఫిబ్రవరి 11: చెరువులో పడి నలుగురు చిన్నారులు మృతి చెందారు. మేకలను మేపేందుకు వెళ్లిన ఇద్దరు అన్నదమ్ములు చెరువులో దిగగా నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ప్రమాదం భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామంలో జరిగింది. అలాగే ఈత కొట్టేందుకు చెరువుకు సరదాగా వెళ్లిన ఇద్దరు స్నేహితులు నీటిలో మునిగి మృతిచెందారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం అమ్మాపురంలో ఆదివారం జరిగింది. చిన్నారులమృతితో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

మేకలను మేపేందుకు..

భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన బొంతల అనూష - రాజు దంపతులు వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. వీరికి ముగ్గురు సంతానం. కుమారులు అరుణ్‌కుమార్ (12), కార్తీక్ (9) తోపాటు ఓ కూతురు ఉంది. అరుణ్ కుమార్ మహబూబాబాద్ జిల్లా తొర్రూరు సమీపంలోని సన్నూర్‌లో ఆరో తరగతి చదువుతున్నా డు. హాస్టల్‌లో ఉన్న అతడు.. మూడు నెలల కిందట ఇంటికి వచ్చేశాడు. హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేకపోవడంతో అతడిని స్వగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పదిరోజుల కిందట చేర్పించారు. రెండో కుమారుడు కార్తీక్ స్థానికంగా నాలుగో తరగతి చదువుతున్నాడు. ఇటీవలే రాజు కొన్ని మేకలను కొన్నాడు. వాటి ని అతడి భార్య అనూష మేపుతోంది. ఈ క్రమం లో ఆదివారం రాజు వ్యక్తిగత పని నిమిత్తం కాళేశ్వరం వెళ్లాడు. రోజూలాగే అనూ ష మేక లు మేపుకుంటూ ఇద్దరు కొడుకులను కూడా తోడుగా తీసుకెళ్లింది. మధ్యాహ్న సమయంలో అనూష పిల్లలు ఇద్దరికి మేకలను అప్పగించి భోజనం చేయడానికి ఇంటికి వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత మేకలు ఇంటికి చేరాయి. ఇద్దరు పిల్లలు మాత్రం తిరిగి రాలేదు. దీంతో ఆందోళనకు గురైన తల్లి.. చుట్టుపక్కల వెతికింది.

చెరువు వద్దకు వెళ్లి చూడగా ఇద్దరి చెప్పు లు కనిపించాయి. దీంతో ఏడుస్తూ గ్రామంలో కి వచ్చి కొంతమందిని వెంట తీసుకొని వెళ్లిం ది. చెరువులో గాలించగా ఇద్దరి కొడుకుల మృ తదేహాలు లభ్యమయ్యాయి. సంఘటనా స్థలా న్ని కాటారం సీఐ నాగేశ్వర్‌రావు పరిశీలించా రు. ఇద్దరు పిల్లలు చెరువులో వద్దకు ఎందుకు వెళ్లారు.. ప్రమాదం ఎలా జరిగిందనే విష యం తెలియరాలేదు.

ఈతకు వెళ్లి..

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మం డ లం అమ్మాపురం గ్రామానికి చెందిన గంధం స్వామి - రూప దంపతుల పెద్దకుమారుడు గంధం యాకూబ్ (14) స్థానిక ప్రాథమిక పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. తండ్రి జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా తల్లి రూప, తమ్ముడు శ్రావణ్‌కుమార్ తో కలిసి ఉంటున్నాడు. అలాగే ఇదే గ్రా మానికి చెందిన కిన్నెర మహేష్-సావిత్రి దం పతుల కుమారుడు జంపా (12) స్థానిక పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు ఇద్దరు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లగా, నాన్నమ్మ గజ్జెలమ్మతో ఉంటున్నాడు. ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో వీరిద్దరు మరో నలుగురు స్నేహితులతో కలిసి గ్రామ శివారులో ఉన్న పెద్దచెరువు వద్దకు సరదాగా ఈత కొట్టడానికి వెళ్లా రు. చెరువు ఒడ్డున ఈతకొడుతూ ఒక్కసారిగా లోతులోకి వెళ్లారు. దీంతో ఇద్దరు చిన్నారులు నీటిలో మునిగి అక్కడిక్కడే మృతి చెందారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్సై కూచిపుడి జగదీశ్ సంఘటనా స్థలానికి చేరుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను తొర్రూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గంధం రూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఐనవోలులో సందడి

ఐనవోలు, ఫిబ్రవరి 11: ఐనవోలు మల్లికార్జునస్వామి వా రాంతపు జాతరల్లో 4వ ఆదివారం జాతరకు భక్తులు భారీగా తరలివచ్చారు. శనివారం సాయంత్రం నుంచే భక్తులు ఆల య ప్రాంగణంలో విడిదిచేశారు. ఆదివారం ఉదయం స్వామివారికి మేలుకొలుపు తర్వాత శైవాగమ పద్ధతిలో అర్చకులు విశేష అభిషేకాలు కల్యాణం నిర్వహించి, రుద్రాభిషేకాలు జరిపారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో నజర్, చెలక పట్నాలు వేసి బోనంవండి అమ్మవార్లకు స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఒగ్గు పూజారులు నజర్, చిల్క పట్నాల వద్ద పూర్వీకులను స్తుతించారు. ఆపదల నుంచి గట్టెక్కించి కోర్కె లు తీర్చమని మల్లికార్జునస్వామిని భక్తులు వేడుకున్నారు. మొక్కుల్లో భాగంగా స్వామి అమ్మవార్లకు భక్తులు ఒడి బి య్యం, వస్త్రాలు, ముత్తైదు సామగ్రిని ముట్టచెప్పారు. మరి కొందరు భక్తులు రథసేవ మొక్కుల్లో భాగంగా రథంను ఆలయం చుట్టు లాగుతూ ప్రదక్షిణలు చేశారు. ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు


భారీగా ఎంపీడీవోల బదిలీలు

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మందికి స్థానచలనం
- వరంగల్ జిల్లా నుంచి 10 బదిలీ
- లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో చర్య

వివరాలు : 6లో








కేయూ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్?

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: కేయూ పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. ఖమ్మం జిల్లాకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఇక్కడికి బదిలీ అయిన శ్రీధర్ రాకను మంత్రి ద్వారా అడ్డుకున్నట్లు సమాచారం. కాగా, కొన్ని రోజుల కిందట వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో సీఐల బదిలీలు జరగగా.. కేయూలో పని చేసిన అబ్బయ్య పరకాలకు బదిలీ అయ్యారు. ఇక్కడికి ఖమ్మంలో పని చేస్తున్న సీహెచ్. శ్రీధర్‌ను నియమించారు. అయితే శ్రీధర్ రాకపై సందిగ్ధత ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఖమ్మం జిల్లాలో సుదీర్ఘకాలంపాటు ఎస్ఐ, సీఐగా పని చేసిన శ్రీధర్ అక్కడి బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. అక్కడ చాలామంది కాంగ్రెస్ కార్యకర్తలను వేధించడంతోపాటు కొందరిపై పీడీయాక్ట్ కూడా నమోదు చేసినట్టు కాంగ్రెస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ క్రమంలో వరంగల్ కమిషనరేట్‌లోని కీలకమైన కేయూ పీఎస్‌లో పోస్టింగ్ పొందడాన్ని అక్కడి నేతలు జీర్ణించుకోలేకపోతున్నట్లు తెలిసింది. ఎలాగైనా శ్రీధర్ పోస్టింగ్‌ను రద్దు చేయాలని విదేశాల్లో ఉన్న ఖమ్మం జిల్లాకు చెందిన ఓ మంత్రిపై ఒత్తిడి చేసినట్టు సమాచారం. దీంతో సీపీకి విషయం తెలుపగా ఆయన నిఘావర్గాల ద్వారా శ్రీధర్ సర్వీస్ గురించి తెలుసుకున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం కమిషనరేట్‌లో పనిచేస్తున్న ఓ ఉన్నత స్థాయి అధికారి శ్రీధర్‌కు ఫోన్ చేసి కేయూ పీఎస్‌లో జాయిన్ కావొద్దని సూచించినట్టు విశ్వసనీయ సమాచారం. దీంతో శ్రీధర్ పోస్టింగ్‌కు బ్రేక్ పడిందని ప్రచారం జరుగుతోంది. అయితే కేయూకు వీఆర్, ఎస్బీలో ఉన్న ఓ అధికారుల్లో ఎవరికైనా విధులు అప్పగించాలనే ఆలోచనలో ఉన్నతాధికారులు ఉన్నట్లు తెలుస్తోంది.







భారీగా ఎంపీడీవోల బదిలీలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మందికి స్థానచలనం

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 11: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది ఎంపీడీవోలు పొరుగు జిల్లాలకు బదిలీ అయ్యారు. మరో రెండు మాసాల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న దృష్ట్యా ఒకే స్థానంలో మూడేళ్ల సర్వీసు పూర్తి అయిన ఎంపీడీవోలను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ శనివారం బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 32 జిల్లాల్లో 395 మంది ఎంపీడీవోలు బదిలీ కాగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో 51 మంది బదిలీ అయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని హనుమకొండ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న 5 ఎంపీడీవోలు, జనగామ జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, జయశంకర్ భూపాల్‌పల్లి జిల్లా నుంచి 8 ఎంపీడీవోలు, మహబూబాబాద్ జిల్లా నుంచి 16 ఎంపీడీవోలు, ములుగు జిల్లా నుంచి 6 ఎంపీడీవోలు, వరంగల్ నుంచి 10 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. సోమవారం రిలీవ్ కానున్న ఎంపీడీవోలు మంగళవారం వారికి కేటాయించిన జిల్లాలో విధుల్లో చేరనున్నారు.

- **హనుమకొండ జిల్లా ఎంపీడీవోలు :** జవహార్‌రెడ్డి ములుగు జిల్లాకు, టి.సునిత కరీంనగర్, జి.వెంకటరమణ వరంగల్, ఎల్.భాస్కర్ జయశంకర్ భూపాలపల్లి, ఆర్.రామకృష్ణ ములుగు బదిలీ అయ్యారు.
- **జనగామ జిల్లా ఎంపీడీవోలు:** మహ్మద్ హసీం సూర్యాపేట, బి.సురేందర్ ఖమ్మం, వి.అశోక్‌కుమార్ ఖమ్మం, శ్రీధర్‌స్వామి ఖమ్మం, పి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, వి.రాజా త్రివిక్రం సిద్దిపేట బదిలీ అయ్యారు.
- **భూపాలపల్లి జిల్లా ఎంపీడీవోలు:** కె.అనిల్‌కుమార్ హనుమకొండ, ఎల్.అరుంధతి వరంగల్, పి.ఆంజనేయులు వరంగల్, జి.సురేందర్ ఖమ్మం, ఎం.శంకర్ వరంగల్, జి.నరసింగహమూర్తి వరంగల్, ఎ.రవీంద్రనాథ్ ఆదిలాబాద్, వి.క్రిష్ణవేణి వరంగల్ బదిలీ అయ్యారు.
- **మహబూబాబాద్ జిల్లా ఎంపీడీవోలు:** జి.రవిందర్‌రావు భద్రాద్రి కొత్తగూడెం, ఎం.సత్యనారాయణరెడ్డి సూర్యాపేట, జి.రవిందర్ ఖమ్మం, వి.అపర్ణ రంగారెడ్డి, పి.వెంకటేశ్వర్లు హనుమకొండ, బి.వి.చలపతిరావు భద్రాద్రి కొత్తగూడెం, ఎస్.కుమార్ ఖమ్మం, బి.వేణుగోపాల్‌రెడ్డి ఖమ్మం, బి.భారతి భద్రాద్రి కొత్తగూడెం, కె.ధన్‌సింగ్ భద్రాద్రి కొత్తగూడెం, బి.గోవిందరావు వరంగల్, కె.శ్యాంసుందర్ జయశంకర్ భూపాలపల్లి, కె.వెంకటేశ్వర్లు జయశంకర్ భూపాలపల్లి, పి.సరస్వతి ఖమ్మం, ఎ.రోజారాణి ఖమ్మం, కె.శేషాద్రి ఖమ్మం బదిలీ అయ్యారు.
- **ములుగు జిల్లా ఎంపీడీవోలు:** అబ్బూరి ఫణిచంద్ర వరంగల్, సీహెచ్.శ్రీనివాస్, వరంగల్, జె.ప్రవీణ్‌కుమార్ హనుమకొండ, ఎం.సత్యాంజనేయ ప్రసాద్ యాదాద్రి భువనగిరి, ఎండి.ఇక్బాల్ హుస్సేన్ జయశంకర్ భూపాలపల్లి, అద్దూరిబాబు జయశంకర్ భూపాలపల్లి బదిలీ అయ్యారు.
- **వరంగల్ జిల్లా ఎంపీడీవోలు:** సీహెచ్.సంతోష్‌కుమార్ సూర్యాపేట, టి.రాజ్యలక్ష్మీ ములుగు, ఎ.క్రిష్ణమూర్తి మెదక్, జి.క్రిష్ణ ప్రసాద్ ములుగు, ఎస్.విజయ్‌కుమార్ హనుమకొండ, ఎస్.వీరేషం హనుమకొండ, జి.రాజేంద్రప్రసాద్ ములుగు, పి.సుమనవాణి ములుగు, ఎం.వెంకటేశ్వర్‌రావు జయశంకర్ భూపాలపల్లి, జి.అనిత ములుగుకు బదిలీ అయ్యారు.

వైద్యులపై చర్యలు తీసుకోండి..

హసన్‌పర్తి పీఎస్‌లో బాధితుడి ఫిర్యాదు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: గాల్‌బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని తన భార్యను ఆస్పత్రిలో చేరిస్తే.. వైద్యుల నిర్లక్ష్యంతో ప్రాణం పోయిందని, వారిపై చర్యలు తీసుకోవాలని ఓబాధితుడు హసన్‌పర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడి తెలిపిన ఫిర్యాదు మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. వరంగ ల్ జిల్లా కరీమాబాద్ తోటకు చెందిన ఎమ్డీ అన్వర్ తన భార్య నస్రీన్‌కు గాల్ బ్లాడర్‌లో రాళ్లు వచ్చాయని చికిత్స కోసం ఆరెపల్లిలోని రిలీఫ్ ఆస్పత్రిలో ఈ నెల 5న చేర్పించారు. 9వ తేదీన అక్కడి డాక్టర్లు ఆపరేషన్ చేసిన తర్వాత కొంత సమయానికి నస్రీన్‌కు మూత్రం ఆగిపోయింది. ఉదయం నుంచి సా యంత్రం వరకు చికిత్స చేసినట్టు చేసి చివరికి పరిస్థితి విషమించిందని, మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని వేరే ఆస్పత్రికి తీసుకుపోవాలని వైద్యులు సలహా ఇచ్చారు. అక్కడికి వెళ్లి చికిత్స చేస్తుండగా శనివారం సా యంత్రం నస్రీన్ మృతి చెందింది. తనభార్య మరణానికి రిలీఫ్ ఆస్పత్రి సిబ్బందే కారణమని, అక్కడి డాక్టర్లతోపాటు నిర్వాహకులను అరెస్టు చేసి తనకు న్యాయం చేయాలని అన్వర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

'మల్లికాంబ'లో అన్నదానం


అన్నదానం చేస్తున్న రామమ్ చిట్‌ఫండ్స్ ప్రతినిధులు

సుబేదారి, ఫిబ్రవరి 11: రామమ్ చిట్‌ఫండ్స్ 16వ వార్షికోత్సవం సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని మల్లికాంబ మనోవికాస కేంద్రంలో ఉన్న మానసిక వికలాంగులకు ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో రామమ్ చిట్‌ఫండ్స్ చైర్మన్ బన్న సుధాకర్, ఎండీ శ్రీరామోజు గిరిబాబు, చిట్‌ఫండ్స్ సిబ్బంది, మల్లికాంబ మనోవికాస కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.




మేడారంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన ప్రధాన వైద్యశాల

‘ఆరోగ్య’ జాతర!

● మేడారంలో పకడ్బందీగా వైద్య సేవలు ● వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత ఏర్పాట్లు ● 50 పడకలతో తాత్కాలిక వైద్యశాల
● జాతర పరిసరాలు, దారుల్లో 72 మెడికల్ క్యాంపులు ● 150 మంది డాక్టర్లు, 530 మంది పారామెడికల్ సిబ్బంది నియామకం

ములుగు, ఫిబ్రవరి 10: మేడారం మహాజాతరకు వచ్చే భక్తులకు వైద్యసేవలు అందించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ సన్నద్ధమైంది. ఈసారి ప్రభుత్వం రూ. కోటి నిధులను కేటాయించగా ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. జాతర పరిసరాల్లో తాత్కాలిక పెద్దాస్పత్రి, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఓపీ సేవలు కొనసాగుతుండగా, ఈనెల 20నుంచి జాతర ముగిసేంత వరకు ఇన్‌పేషెంట్ సేవలను అందించనున్నారు. ఎప్పటిలాగే మేడారం జాతరలో 50 పడకలతో తాత్కాలిక ఆస్పత్రిని ఏర్పాటు చేస్తున్నారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలకు సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేస్తున్నారు. మూడు షిష్టుల్లో తొమ్మిది మంది వైద్యనిపుణులు పనిచేయనున్నారు. షిష్టుకు 10మంది చొప్పున స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలతో ఇక్కడ ఔట్ పేషెంట్, ఇన్ పేషెంట్ 24 గంటల సేవలను అందించనున్నారు. మేడారం ఇంగ్లీష మీడియం స్కూళ్లలో ఆరు బెడ్లతో మెడికల్ క్యాంపును ఏర్పాటుచేసి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. అదేవిధంగా జాతర పరిసరాల్లో 30మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నారు. చింతల్, నార్లాపూర్, కొత్తూరు, కాల్వపల్లి క్రాస్‌రోడ్డు, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు-రెడ్డిగూడెం రోడ్ డ్యామ్, జంపనవాగు, ఊరట్టం కాజ్‌వే, రెడ్డిగూడెం, కొంగల మడుగు, ఆర్‌టీసీ బస్టాండు, ఇంగ్లీష మీడియం స్కూల్, మేడారం చెరువు, పోలీసు క్యాంపు, చిలుకలగుట్ట, వీవీఐపీ పార్కింగ్ ప్లేస్, పడిగాపూర్, హరిత హోటల్, కొత్తూరు సబ్‌స్టేషన్, వెంగ్లాపూర్, మేడారం-తాడ్వాయి రోడ్డు, గద్దెల ప్రధాన ద్వారం, బయ్యక్కపేట రోడ్డు, కన్నెపల్లి జంక్షన్ రోడ్డు, ఊరట్టం రోడ్డు మామిడి తోట, మేడారం గ్రామపంచాయతీ సమీపంలోని రెండో గేటు వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు.

అదేవిధంగా మేడారం వచ్చే ప్రధాన దారుల్లో కూడా క్యాంపులు ఏర్పాటు చేస్తున్నారు. గూడెప్పాడ్, కటాక్షపూర్, మల్లంపల్లి, గట్టమ్మ దేవాలయం, జంగాలపల్లి క్రాస్‌రోడ్డు, చల్వాయి క్రాస్‌రోడ్డు, లక్నవరం, పస్రా, కాల్వపల్లి, రేగులగూడెం, పెగడపల్లి, బోర్లగూడెం, కాటారం, తాడ్వాయి, బీరెల్లి, కొత్తూరు, కాటాపూర్, ఆకులవారి ఘనపూర్, ముల్లకట్ట బ్రిడ్జి, జగన్నాధపురం, చీకుపల్లి, టేకులగూడెం, వెంకటాపురం, మంగపేట, మల్లూరు, రాజుపేట, చుంచుపల్లి, బ్రాహ్మణపల్లి, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లాపూర్, బయ్యక్కపేట, దూదేకులపల్లి, రాంపూర్, మేడారం క్రాస్‌రోడ్డు, రామప్ప, గుర్రంపేట, గణపురం క్రాస్‌రోడ్డు వద్ద మొత్తం 42 క్యాంపులు ఏర్పాటవుతున్నాయి. భక్తులు చిన్న అనారోగ్యానికి గురైనా ఈ శిబిరాలను సంప్రదిస్తే అక్కడ 24గంటలు అందుబాటులో ఉండే డాక్టర్లు, సిబ్బంది వైద్యసేవలను అందించనున్నారు. ఇద్దరు డాకర్లు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సహాయక సిబ్బంది కలిపి మొత్తం 10మంది విధుల్లో ఉంటారు.


భక్తులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

680 మంది డాక్టర్లు, సిబ్బంది

వైద్య, ఆరోగ్య శాఖ పెద్ద సంఖ్యలో వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని జాతర విధులకు నియమించనుంది. 150 మంది వైద్యులు, 530 మంది పారామెడికల్ సిబ్బందితో భక్తులకు సేవలు అందించనుంది. ములుగు, హనుమకొండ, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జనగామ జిల్లాల నుంచి 150 మంది డాక్టరను పిలిపిస్తున్నారు. అదే విధంగా ఎంజీఎం, సీకేఎం, రీజనల్ ఐహాస్పిటల్, జీఎంహెచ్ నుంచి స్పెషలిస్టు వైద్యులను నియమిస్తున్నారు. 60మంది నాలుగో తరగతి ఉద్యోగులు సహాయకులుగా సేవలందించనున్నారు. ఐఎంఏ సహకారంతో ఓ గుండెవైద్య నిపుణుడిని నియమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఓ ఈసీజీ టెక్నీషియన్‌ను కూడా నియమించనున్నారు.


మేడారం తాత్కాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భక్తులు

40 బైక్ అంబులెన్స్‌లు

మహాజాతర సమయంలో మేడారం పరిసరాల్లో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దారులన్నీ ఇసుకేస్తే రాలనంత తయారవుతాయి. ఈ సమయంలో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుంది. అత్యవసర సేవల కోసం బైక్ అంబులెన్స్‌లను వినియోగించనున్నారు. ఇందుకు 40బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తున్నారు. 108 అంబులెన్స్‌లు 16ను కూడా సిద్ధం చేస్తున్నారు. ములుగు, ఏటూరునాగారం, తాడ్వాయి, పస్రా ఆస్పత్రుల వద్ద అత్యవసర సేవల కోసం నాలుగు అంబులెన్స్‌లు, ఆరు ఆర్‌బీఎస్‌కే, మూడు ఎంసీహెచ్ వాహనాలను సిద్ధంగా ఉంచుతున్నారు. అదేవిధంగా 120 మంది 108సిబ్బంది సేవలు వినియోగించుకోనున్నారు.

ఏడుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లు

అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్సలు జరిపేందుకు ఆరుచోట్ల మెడికల్ కేర్ యూనిట్లను(రెఫరల్ హాస్పిటల్స్) ఏర్పాటు చేస్తున్నారు. ములుగు ఏరియా వైద్యశాల, ఏటూరునాగారం, భూపాలపల్లి, పరకాల సీహెచ్‌సీలు, తాడ్వాయిలోని పీహెచ్‌సీలో 10పడకలు, పస్రాలో ఐదు పడకలతో వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

కొనసాగుతున్న వైద్యసేవలు

జనవరి 14 నుంచి మేడారంలో వైద్యసేవలు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు 3,850 మందికి ఓపీ సేవలు అందించారు. 50వేల మాస్కులు, రూ.7లక్షల 50వేల విలువైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈనెల 13 నుంచి 24 గంటల వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. జాతర జరిగే 21 నుంచి 24వ తేదీ వరకు ప్రతి రోజూ తొమ్మిది మంది వైద్య నిపుణులు 24 గంటలూ విధుల్లో ఉంటారు. తాడ్వాయిలో ఆపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.42లక్షలతో సెంట్రల్ డ్రగ్ స్టోరేజ్ సెంటర్ నుంచి మందులు తెప్పిస్తున్నారు. ఈసారి కోటి 60లక్షల మంది భక్తులు జాతరకు వస్తారని వైద్య ఆరోగ్య శాఖ భావిస్తోంది. 2022 జాతరలో మొత్తం 2 లక్షల 9వేల మంది ఓపీ, 5,222మందికి ఐపీ సేవలు అందించింది.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు జాగ్రత్తలు పాటించాలి

డాక్టర్ అల్లెం అప్పయ్య, ములుగు జిల్లా డీఎంహెచ్‌వో



మేడారం జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తున్నాం. ఏర్పాట్లు పూర్తికావొచ్చాయి. తాత్కాలిక ప్రధాన ఆస్పత్రిలో ఈనెల 13నుంచి జాతర ముగిసేంత వరకు 24గంటల వైద్యసేవలు అందిస్తాం. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. అత్యవసర సమయంలో జాతరలోని ప్రధాన ఆస్పత్రికి రాలేని పరిస్థితిలో ఇప్పుడు వాడుతున్న మందులను వెంట తెచ్చుకోవడం మంచిది. సురక్షితమైన ఆహారం, తాగునీటిని తీసుకోవాలి. ముఖానికి తప్పనిసరిగా మాస్కులు ధరించాలి. ఏదైనా అనారోగ్యం సోకితే సమీపంలోని వైద్య శిబిరానికి వెళ్లి ఉచితంగా సేవలు పొందాలి.


ములుగులో ఇసుక లారీలను దారి మళ్లిస్తున్న పోలీసులు

ఇసుక లారీలపై నియంత్రణేదీ?!

నిలుపుదలపై ఇంకా నిర్ణయం తీసుకోని యంత్రాంగం

ములుగు, ఫిబ్రవరి11: మేడారం భక్తులకు ట్రాఫిక్ కష్టాలు మొదలయ్యాయి. జాతీయ రహదారి పనులకు తోడు ఇసుక లారీల కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఈ క్రమంలో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఏటూరునాగారం, మంగపేట, వాజేడు, వెంకటాపురం(నూగూరు) మండలాలతోపాటు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలలోని ఇసుక క్వారీల నుంచి నిత్యం వందలాది ఇసుక లారీలు వరంగల్, హైదరాబాద్‌కు వెళ్తున్నాయి. జాతరకు సమయం దగ్గరపడుతుండగా పెద్ద సంఖ్యలో భక్తులు వాహనాలలో తలివస్తున్నారు. ఆర్టీసీ కూడా స్పెషల్ సర్వీసులను నడిపిస్తోంది. ఈనేపథ్యంలో లారీల కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇదే సమయంలో ములుగు-గూడెప్పాడు మధ్య 163జాతీయ రహదారి విస్తరణ పనులు కూడా జరుగుతున్నాయి. గట్టమ్మ దేవాలయం-మల్లంపల్లి మధ్య రహదారి కంకర పోసి చదును చేస్తున్నారు. కల్వర్టు పనులూ కొనసాగుతున్నాయి. ఈనేపథ్యంలో భారీగా వచ్చే వాహనాలు దారి ఇరుగ్గా ఉండటంతో ముందుకు కదలలేక పోతున్నాయి. ఆదివారం భూపాల్‌నగర్ స్టేజీ వద్ద ఓ లారీ రోడ్డుపైనే దిగబడటంతో సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో మేడారం భక్తులు, సాధారణ ప్రయాణీకులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. తక్షణమే స్పందించిన పోలీసులు ఇసుక లారీలను ములుగులో దారి మళ్లించారు. బస్సులు, ఇతర వాహనాలను ముందుకు అనుమతించారు. గట్టమ్మ దేవాలయం మూలమలుపు వద్ద కల్వర్టు పనులు జరుగుతుండటంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఇసుక లారీలను నిలిపివేతపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని ఇటీవల మంత్రి సీతక్క అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. అయితే ఆదిశగా చర్యలు లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఎదురవుతోంది. జాతీయ రహదారి పనుల జాప్యంపై కూడా మంత్రి అసహనం వ్యక్తంచేశారు. అయితే పనులు జరుగుతున్న ప్రదేశాలు, ఇరుకైన కల్వర్టుల వద్ద ట్రాఫిక్ నియంత్రణ చర్యలు తీసుకుంటే కొంతవరకు సమస్య పరిష్కారమయ్యేది. కానీ, వాహనాలు నిలిచిపోయేదాకా ఎవ్వరూ స్పందించకపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. వెంటనే జిల్లా అధికారులు స్పందించి ఇసుకలారీలపై ఆంక్షలు విధించాలని, జాతీయ రహదారి విస్తరణ జరిగే ప్రదేశాలలో పోలీసు సిబ్బందిని నియమించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు.


వనదేవతలకు మొక్కుతున్న మంత్రి సీతక్క ఎస్పీ పీవో

సకల సౌకర్యాలతో మహాజాతర

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క

మేడారం, ఫిబ్రవరి 11: మహా జాతరలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మేడారంలో ఆమె ఆదివారం పర్యటించారు. సమ్మక్క, సారలమ్మల గద్దెలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. మహాజాతరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేశామని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ఠ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. జాతరకువచ్చే మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్య కల్పిస్తున్నామని అన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీసు శాఖ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, గవర్నర్ తమిళిసై మేడారానికి రానున్నారని, అందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశామని అన్నారు. మంత్రి వెంట కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్, ఎస్పీ శబరీశ్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, దేవాదాయ శాఖ కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తదితరులు ఉన్నారు.

ఉత్సవ కమిటీని ప్రతిపాదించిన మంత్రి

మేడారం మహాజాతర నిర్వహణకు ఉత్సవ కమిటీపై మంత్రి సీతక్క దేవాదాయశాఖ కమిషనర్‌కు 15మందితో ప్రతిపాదనలు పంపారు. ఛైర్మన్‌గా అర్రెం లచ్చుపటేల్‌తోపాటు 14 మంది సభ్యుల పేర్లను ప్రతిపాదించారు. మిలుకూరి ఐలయ్య, కోడి గోపాల్, గంగెర్ల రాజారత్నం, కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల భిక్షపతి, సుంచ హైమావతి, చామర్తి కిశోర్, కోరం అబ్బయ్య, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా సిద్దబోయిన జగ్గారావు పేర్లను పేర్కొన్నారు.


భక్తులతో కిటకిటలాడుతున్న గద్దెల ప్రాంగణం


బెల్లంతో వెళుతున్న భక్తురాలు

మేడారంలో మొక్కుల సందడి

వనదేవతల దర్శనానికి తాకిడి




యాటను మొక్కుతున్న దృశ్యం


వనదేవతల దర్శనానికి బెల్లంతో వెళుతున్న మహిళా భక్తులు


జంపన్నవాగు బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానాలు చేస్తున్న దృశ్యం

ఒలంపియాడ్‌లో రాష్ట్ర స్థాయి టాపర్‌గా సంకీర్తన

శంభునిపేట, ఫిబ్రవరి 11 : ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ ఆధ్వర్యంలో జనవరి 28న ఖమ్మంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీలలో రంగశాయిపేటకు చెందిన సంకీర్తన టాపర్‌గా నిలిచింది. సంకీర్తన ప్రస్తుతం రంగశాయిపేటలోని అరవింద పబ్లిక్ స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. ఈ సందర్భంగా ఒలంపియాడ్ గణిత విభాగంలో తమ స్కూల్ విద్యార్థిని సంకీర్తన స్టేట్ టాపర్‌గా నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ పంచకం నర్సయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 300 పాఠశాలల నుంచి సుమారు 500 మంది వరకు పోటీ పడగా సంకీర్తన టాపర్‌గా నిలిచిందన్నారు. ఈనెల 17న ఖమ్మంలో జరిగే బహుమతి ప్రదానోత్సవంలో సంకీర్తనకు అవార్డుతోపాటు సత్కారం చేయనున్నారని పేర్కొన్నారు.



సంకీర్తన



దత్తక్షేత్రంలో పూజల్లో పాల్గొన్న మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

దత్త క్షేత్రంలో వైభవంగా తైలాభిషేకాలు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11: నగరంలోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్త క్షేత్రంలో ఆదివారం దత్తాత్రేయ స్వామికి సుగంధ ద్రవ్యాలు నువ్వుల నూనెతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు రాపాక గోపీకృష్ణశర్మ ఆధ్వర్యంలో దత్తాత్రేయ స్వామి ఉత్సవ మూర్తికి భక్తులతో తైలంతో అభిషేకం చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు వైవీ వామన్‌రావు, డాక్టర్ లక్ష్మినారాయణ, ప్రొఫెసర్ శివరామకృష్ణ ప్రసాద్, చకిలం ఏకాంబరం, డాక్టర్ వద్దిరాజు శార్వాణి పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శోభాయాత్ర

రంగశాయిపేటలో దేవతామూర్తుల ఊరేగింపు..

ఘనంగా ప్రారంభమైన బొడ్రాయి మహోత్సవం

శంభునిపేట, ఫిబ్రవరి 11 : నగరంలోని రంగశాయిపేటలో రంగశాయిపేట యూత్ ఫోర్స్ (ఆర్‌వైఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామదేవత (బొడ్రాయి) ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద బ్రాహ్మణులు వెలిదె భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రిల చేతుల మీదుగా గణపతి హోమంతో ప్రారంభమైన పూజల్లో భాగంగా మహంకాళీ ఆలయ ప్రాంగణంలో 50 మంది రుత్వికులచే ప్రత్యేక పూజలు చేశారు. దేవతామూర్తులకు గణపతి పూజ, గోపూజ, మంత్రజపాలు, ఆరాధన, రక్షాబంధనం వైదిక తీరులో నిర్వహించారు. అనంతరం నెహ్రూ జంక్షన్, రామాలయం వద్ద ప్రతిష్ఠించనున్న దేవతా విగ్రహాలను మహంకాళీ ఆలయం నుంచి పురవీధుల గుండా ప్రత్యేక రథం పై గ్రామదేవతల విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. శోభాయాత్రలో భాగంగా కర్ణాటక, శ్రీశైలం నుంచి వచ్చిన శివలింగదత్త స్వాములు చేసిన విన్యాసాలు స్థానికులను అబ్బురపరిచింది.



విన్యాసాలు చేస్తున్న శివలింగదత్తులు

కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గుండు చందన, ఉత్సవ కమిటీ కన్వీనర్‌లు కొల్లూరి యోగానంద్, కేడల జనార్దన్, గుండు పూర్ణచందర్, కేడల పద్మ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కరాటేలో పతకం..

శంభునిపేట, ఫిబ్రవరి 11 : రాష్ట్ర స్థాయి కరాటే పోటీలలో శంభునిపేట విశ్వనాథకాలనీకి చెందిన కె.శ్రీరామ్ నాయక్ రాణించారు. సూర్య షోటోకాన్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలు ఆదివారం ములుగు జిల్లా ఏటూరునాగారంలో నిర్వహించారు. ఈ పోటీల్లో భాగంగా బ్లాక్ బెల్ట్ కేటగిరీలో కేలోతు శ్రీరామ్‌నాయక్ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అనంతరం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నాడు. అకాడమీ చైర్మన్ వి.చంద్రశేఖర్ మాస్టర్ వద్ద శిక్షణ పొందుతూ రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో శ్రీరామ్ రాణిస్తున్నారు.



మంత్రి సీతక్క చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న శ్రీరామ్

రాష్ట్ర స్థాయి పద్మశాలీల వివాహ పరిచయ వేదిక



వివాహ పరిచయ వేదికలో పాల్గొన్న రాష్ట్ర స్థాయి ఉద్యోగులు

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11: సేవా దృక్పథంతో పద్మశాలీల వివాహ పరిచయ వేదికలను నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర పద్మశాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం నగరంలోని కెమిస్ట్రీ భవన్‌లో రాష్ట్ర స్థాయి పరిచయ వేదిక నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి 500 మంది ఈ కార్యక్రమానికి వచ్చి పాల్గొన్నారు. గత ఎనిమిదేళ్లలో 500మందికి వివాహ సంబంధాలు కుదిరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పద్మశాలీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కోడం రవి ప్రకాష్, రాష్ట్ర కన్వీనర్ లకుం నవీన్‌రాజ్‌కుమార్, పిట్ట ఉమాదేవి, ఆడెపు నాగరాజు, బూర తిరుపతయ్య, బింగి సురేష్, ధర్మదేవ్, నాగసాగర్, గుర్రం రాజమౌళి, లింగమూర్తి, నల్ల మాధవి పాల్గొన్నారు.

యూత్‌ఫర్ సేవలో నాలుగు బహుమతులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 11: యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ పోటీల్లో ఖిలావరంగల్ మధ్యకోటలోని ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బహుతులను సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాడు ప్రసాద్ తెలిపారు. ఆదివారం నిట్‌లో జరిగిన చిగురు 2024 కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి 45 స్కూల్‌లో 900 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జెస్ట్ ఫర్ ఏ మినిట్‌లో మంద చిచ్చల్ కార్తికేయ ప్రథమ, చిత్రలేఖనంలో సమీరా ప్రథమ, యోగాలో సిరిచందన తృతీయ, రంగోలీలో కూస కావ్య, మట్టెవాడ చందన ద్వితీయ బహుమతులను సాధించారన్నారు. వీరికి నిట్ డీన్ ప్రొఫెసర్ శ్రీనివాసచారి బహుమతులను అందజేశారు. విద్యార్థులకు గైడ్ టీచర్‌గా తెలుగు ఉపాధ్యాయుడు చింతం నాగరాజు, సైన్స్ ఉపాధ్యాయుడు శ్రీధర్, వ్యాయామ ఉపాధ్యాయురాలు జమునా దేవిలు వ్యవహరించారు.



నిట్‌లో బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

కొమ్మాలలో నిమ్స్ ఆర్ఎంవో ప్రత్యేక పూజలు

గీసుగొండ, ఫిబ్రవరి 11: మండలంలోని కొమ్మాల శ్రీలక్ష్మినరసింహ స్వామి ఆలయాన్ని నిమ్స్ ఆర్ఎంవో, తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మార్త రమేష్ ఆదివారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన స్వగ్రామం ఎలుకుర్తిలో ఏర్పాటు చేస్తున్న అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి రూ.25 వేల విరాళాన్ని అందించారు. కాగా రమేష్‌ను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్‌లు వీరాటి లింగారెడ్డి, రవిందర్‌రెడ్డి, నాయకులు రవిందర్, నాయకులు ధనేకుల రాంబాబు, బొడిగె శోభన్ పాల్గొన్నారు.



నరసింహునికి ప్రత్యేక పూజలు చేస్తున్న రమేష్

'వసూళ్లకు పాల్పడుతున్న ఏజెన్సీలపై చర్యలు తీసుకోవాలి'

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11: ఉమ్మడి వరంగల్ జిల్లాలో వివిధ గురుకుల పాఠశాల ప్రభుత్వ సంస్థల ఉద్యోగ నియామకాల్లో ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల పేరా అక్రమంగా లక్షల రూపాయలు వసూలు చేస్తున్న ఏజెన్సీలపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్, ఏఐఎఫ్‌డీఎస్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. ఆదివారం సంఘ నాయకులు బొట్ల నరేష్, నాగరాజు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాల్లో లక్షల రూపాయల వసూళ్లపై దిన పత్రికల్లో వార్తలు వచ్చిన గత ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు.

వెంటనే ఏజెన్సీలపై కలెక్టర్లు స్పందించి నియామకాలపై దర్యాప్తు చేపట్టి అవినీతి అక్రమాలకు పాల్పడిన ఏజెన్సీలపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

వీరాభిమాని ఇంటికి సినీహీరో సుమన్

గీసుగొండ, ఫిబ్రవరి 11: మచ్చాపూర్ గ్రామానికి చెందిన బిల్లా రాజేందర్ ఇంటికి సినీనటుడు హీరో సుమన్ ఆదివారం వచ్చి ఆశ్చర్యపరిచాడు. సుమన్‌కు రాజేందర్ వీరాభిమాని కావటంతో పలుమార్లు ఆయనను కలిసి అభిమానాన్ని చాటుకునేవాడు. కొద్ది నెలలు రాజేందర్ సినీ పరిశ్రమలో కూడా పనిచేశాడు. ఆ సమయంలో ఇంటికి వస్తానని మాటివ్వగా దానికి సుమన్ వచ్చిన మాట నిలుపుకున్నారు. సుమన్ రాకతో రాజేందర్ కుటుంబసభ్యులు ఆనందంతో ఉప్పొంగిపోయింది. సుమన్‌ను మాజీ సర్పంచ్ బోడకుంట్ల ప్రకాష్, ముదిగొండ శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, కూసం రమేష్, భాస్కర్, లింగమూర్తిలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



సుమన్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ ప్రకాష్, రాజేందర్

బంగారు ఆభరణాల దొంగ పట్టివేత

గీసుగొండ, ఫిబ్రవరి 11: మండలంలోని గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా బంగారు ఆభరణాల దొంగను పట్టుకున్నట్లు సీఐ బాబులాల్ తెలిపారు. ఆదివారం సాయంత్రం వరంగల్-నర్సంపేట ప్రధాన రహదారిపై గొర్రెకుంట క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ భాగంగా కారును ఆపి పరిశీలిస్తుండగా డ్రైవింగ్ చేస్తున్న తూర్పాటి ప్రసాద్‌పై అనుమానం వచ్చి విచారించినట్లు సీఐ తెలిపారు. విచారణలో ప్రసాద్ గత సంవత్సరం కీర్తినగర్ జయశంకర్‌కాలనీలో ఓ ఇంట్లో బంగారు ఆభరణాలను ఎత్తికెళ్లినట్లు చెప్పారన్నారు. బంగారం అమ్మగా వచ్చిన డబ్బుతో కారు కొని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలపడంతో కారును సీజ్ చేసినట్లు సీఐ వివరించారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



మహబియా పాఠశాలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు



ఖిలా వరంగల్ పాఠశాలలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

మట్టెవాడ, ఫిబ్రవరి 11: వరంగల్ ఎల్లం బజార్‌లోని మహబూబి యా పంచతన్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల (1989-90)బ్యాచ్ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలుకరించుకుని తమ పాత అనుభవాలను, మధుర స్మృతులను గుర్తుకు తెచ్చుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు నసీరుద్దీన్, యూసుఫ్, ప్రసాద్, సర్వర్, ఫజల్, రహిమాన్ పాల్గొన్నారు.

కోటలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఖిలావరంగల్ : ఆరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల (1998-99 టెన్త్ బ్యాచ్) సమ్మేళనం ఆదివారం జరిగింది. 25ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.

నాటి ఉపాధ్యాయులు భగవంత్, అచ్చ అయిలయ్య, వెంకట్‌రెడ్డి, అక్కయ్య, రాజమణిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ముప్ప మధు, అంబి రాజు, కాంపెల్లి సంతోష్, పెరుమాండ్ల ప్రవీణ్, చిరుత వెంకట్, గాండ్ల రమ, కవిత, ఇనుముల శ్రీలత పాల్గొన్నారు.

మేడారంలో కార్పొరేషన్ సిబ్బంది పారిశుధ్య సేవలు

మట్టెవాడ, ఫిబ్రవరి 11: మహాజాతర మేడారంలో పారిశుధ్య పనులు చేసేందుకు వరంగల్ మహా నగరపాలక సంస్థ ప్రజారోగ్య విభాగం నుంచి 500 మంది కార్మికులను పంపేందుకు కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం అధికారులు నిర్ణయించారు. 20 నుంచి 24వ తేదీ వరకు మేడారం జాతరలో పారిశుధ్య పనులు చేపట్టేందుకు ప్రణాళిక రూపొందించారు. మేడారానికి 500 మంది కార్మికులు, 39 మంది జవాన్లు, పనులను పర్యవేక్షించేందుకు మరో ఇద్దరు శానిటేజర్ సూపర్‌వేజర్లు, ఆరుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ ఇన్‌స్పెక్టర్, ఏడుగురు హెల్త్ అసిస్టెంట్లు మేడారం వెళ్లనున్నారు.

బాల్య మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం

శంభునిపేట, ఫిబ్రవరి 11 : బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించి అండగా నిలిచారు. రంగశాయిపేటకు చెందిన గుండు వేణు ఇటీవల మృతి చెందగా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ఆ కుటుంబానికి శ్రీవాణి పాఠశాలలో చదువుకున్న నాటి వేణు మిత్రులు రూ.70 వేలు అందించారు.

వృద్ధుల రక్షణకు చట్టాలు

గీసుగొండ, ఫిబ్రవరి 11: వృద్ధులకు కూడా వారి రక్షణకు చట్టాలు ఉన్నాయని, అవసరమైనప్పుడు వాటిని వినియోగించుకోవాలని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్, అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితారెడ్డి అన్నారు. ఆదివారం కీర్తినగర్‌లో సమృద్ధి వృద్ధాశ్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు వృత్తిరీత్యా విదేశాల్లో సుదూర ప్రాంతాల్లో ఉండటంతో వృద్ధ తల్లిదండ్రులకు జీవనంభారంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుంకరి మనీషాశివకుమార్, కొండా రాధ, నిర్వాహకులు అనూష, నరేష్, రాజు పాల్గొన్నారు.



వృద్ధాశ్రమాన్ని ప్రారంభిస్తున్న అనితారెడ్డి

త్వరలో వైద్య, ఆరోగ్యశాఖలో బదిలీలు?

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్రస్థాయి అధికారులను బదిలీ చేసింది. ఇక పారా మెడికల్ ఉద్యోగుల వర్క్ ఆర్డర్లు, డిప్యూటేషన్లను రద్దుపరిచింది. ఇక జిల్లా స్థాయిలో దీర్ఘకాలికంగా విధులు నిర్వర్తిస్తున్న అధికారులను బదిలీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. హనుమకొండ, వరంగల్ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు ఇద్దరు కూడా దీర్ఘకాలికంగా వర్క్ ఆర్డర్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ కూడా దీర్ఘకాలికంగా ఈ పోస్టులో కొనసాగుతున్నారు.

ఎంజీఎం ఆస్పత్రి సూపరింటెండెంట్, హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పోస్టుల్లో కొనసాగుతున్నారు. వీరిలో ఎంత మంది బదిలీ వేటు పడనుందోనని అధికారుల్లో ఆందోళన మొదలైంది. అదే విధంగా డిప్యూటీ డీఎంహెచ్ఓ లలో కొందరు దీర్ఘకాలికంగా వరంగల్, హనుమకొండ జిల్లాల్లో తిష్టవేశారు. కొందరికి స్థానచలనం చేసే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలి

సినీ నటుడు సుమన్


నర్సంపేట, ఫిబ్రవరి 11: మహిళలు, బాలికలు స్వీయరక్షణ, ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సినీ నటుడు సుమన్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో ఆదివారం షటోకాన్, ఇన్ స్ట్రక్టర్, కరాటే మాస్టర్ రచ్చ శ్రీనుబాబు ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వాలు వచ్చినా మహిళలకు రక్షణ, భద్రత లేకుండాపోయిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కరాటే వల్ల ఆత్మరక్షణ, శరీరదారుడ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పాఠశాలలో పాఠ్యాంశంగా విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. తల్లిదండ్రులు కరాటేపై పిల్లలకు ఆసక్తి కలిగించేలా ప్రోత్సహించి వారికి కరాటేలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. తెలంగాణలో మహిళలకు రక్షణ, భద్రత కల్పించడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికితీయడం కోసం కరాటే చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించే రచ్చ శ్రీనుబాబు, రచ్చ భవానిచంద్ వంటి కరాటే మాస్టర్లకు క్రీడాభిమానులు చేయూతనందించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణంలోని అయ్యప్ప ఆలయ ట్రస్టు చైర్మెన్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శింగిరికొండ మాధవశంకర్, వ్యాపారవేత్త శ్రీరాం ఈశ్వరయ్య, కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, పాలాయి రవితో పాటు వివిధ జిల్లాలకు చెందిన కరాటే మాస్టర్లు, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.



సుమన్‌ను సన్మానిస్తున్న కరాటే పోటీల నిర్వాహకులు, కరాటే మాస్టర్లు

నేడు మార్కండేయ మహర్షి జయంతి

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 11: సప్తరుషుల్లో ఒకరైన దేవ రుషిగా చిరంజీవిగా ఉన్న పద్మశాలీ కుల ఆరాధ్య దైవం శ్రీమార్కండేయ మహర్షి జయంతి సోమవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నారు. జిల్లాలోని గ్రామాల్లో, పట్టణాల్లో, నగరంలో పద్మశాలీ కుల సంఘాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరుగును. మార్కండేయ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానాలు, కొన్ని చోట్ల రక్తదాన శిబిరాలు కూడా ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రతీ ఇంటిలో మార్కండేయ స్వామి జయంతి సందర్భంగా వేడుక చేసుకోవాలని కుల సంఘం నాయకులు తెలిపారు.



శ్రీమార్కండేయ మహర్షి

చోరీ కోసం వచ్చి చీర్స్!

• బాలసముద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో దొంగతనం • మందుతాగి అక్కడే పడుకున్న నలుగురు దొంగలు • ఉదయం సొత్తుతో పరార్.. • గమనించిన స్థానికులు • పోలీసులకు ఫిర్యాదు..

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 11: వారు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కరడుగట్టిన దొంగలు. దొంగతనం కోసం ఇంట్లో చొరబడిన వారికి విదేశీ మద్యం కనిపించడంతో నోరూరింది. దొరికిన మద్యం తాగి కాసేపు అక్కడే కునుకు తీసి తెల్లవారి లేచి వెళ్లిపోయారు. ఈ వింతైన దొంగతనం బాలసముద్రంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. సుబేదారి పోలీసులు, బాధితుల కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..

వరంగల్ పోలీసు కమిషనరేట్‌లోని సుబేదారి పోలీసుస్టేషన్ పరిధిలోని బాలసముద్రంలో కనపర్తి సత్యనారాయణ కు టుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. హనుమకొండ చౌరస్తాలో వన్‌గ్రామ్ గోల్డ్‌షాపు వ్యాపారం చేస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివించాడు. ఈనెల 7న బాలసముద్రంలోని ఇంటికి తాళం వేసి అమెరికాకు వెళ్లాడు. అప్పటి నుంచి ఇంట్లో ఎవరూ ఉండడం లేదు. తాళం వేసి ఉంది. ఇంటికి సీసీ కెమెరాలు కూడా అమర్చుకున్నాడు. ఈ క్రమంలో తాళం వేసిన ఇంటిని దొంగలు టార్గెట్ చేశారు. శనివారం రాత్రి సుమారు 1 గంటలకు సత్యనారాయణ ఇంటికి నలుగురు గుర్తు తెలియని వ్యక్తులు చేరుకున్నారు. అమర్చిన సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. తర్వాత ప్రధాన ద్వారం తలుపుల బెడెం ఇనుప రాడ్డులో పగులగొట్టి లోనికి ప్రవేశించారు. పూజ గదికి వెళ్లి అక్కడి కొంత బంగారం, వెండి విగ్రహాలు, బీరువాలో ఉన్న సుమారు రూ.30 వేలను తీసుకున్నాడు.

ఇంకా ఇంట్లో వెతుకుతున్న క్రమంలో వారికి విదేశీ మద్యం బాటిళ్లు కనిపించాయి. ఫ్రీజర్‌లో ఉన్న డ్రైఫ్రూట్స్ తీసుకుని నలుగురు కలిసి ఒక చోట సిట్టింగ్ చేశారు. రెండు బాటిళ్లు తాగిన తర్వాత అక్కడే పడుకున్నారు. తెల్లవారి సుమారు 4గంటల సమయానికి మెళకువ రావడంలో చోరీ చేసిన వస్తువులతో బయటకు వచ్చారు. చుట్టుపక్కల వారు గుర్తించి గట్టిగా అరిచారు.

ఇది గమనించిన దొంగల ముఠా కాళ్లకు పని చెప్పారు. ఈ క్రమంలో వారి చెప్పులు, బూట్లు, టవళ్లు అక్కడే వదిలి వెళ్లారు. చుట్టుపక్కల వారు విషయాన్ని అమెరికాలో ఉన్న యజమానికి ఫోన్ చేసి చెప్పడంతో నగరంలో ఉంటున్న బంధువులకు ఫోన్‌లో చెప్పాడు. సత్యనారాయణ సోదరుడు కిషన్‌రావు ఫిర్యాదు మేరకు సుబేదారి పోలీసులతో పాటు క్లూస్ టీం, బాంబ్ స్క్వాడ్ సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని ఆనవాళ్లను సేకరించారు. బాధితుల ఫిర్యాదు తర్వాత రూ.30వేల నగదు కొంత బంగారం, వెండి విగ్రహాలు దొంగలు ఎత్తుకెళ్లినట్టు పోలీసులు గుర్తించారు. సీసీ కెమెరాలో రికార్డు అయిన పుటేజీ ఆధారంగా పోలీసులు నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. మద్యం తాగి చోరీకి పాల్పడిన దొంగల నిర్వాకానికి అందరూ నివ్వెరపోయారు.





పూజగదిలో చోరీ చేసిన వస్తువులు, దొంగలు తాగి పడేసిన ఖాళీ మద్యం బాటిళ్లు



అనాథ యువకుడి చేరదీత

వర్ధన్నపేట, ఫిబ్రవరి 11 : మతిస్థిమితంలేని మూగ అయిన అనాథ యువకుడిని సహృదయ అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకుడు మహ్మద్ చోటు ను చేరదీసి మానవత్వాన్ని మరోమారు చాటుకున్నాడు. ఆదివారం వర్ధన్న పేట మునిసిపాలిటీ పరిధిలో శ్మశాన వాటికలో చెత్తకుప్పల్లో తిరుగాడుతు న్న వ్యక్తిని గుర్తించి హనుమకొండ ప్రశాంత్ నగర్‌లోని వృద్ధాశ్రమానికి తరలించారు. అక్కడ ఆ యుకువడి జుత్తు కట్‌చేయించి, నూతన వస్త్రాలు ధరింపజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు, వర్ధన్నపేట మాజీ జడ్పీటీసీ కమ్మగోని ప్రభాకర్‌గౌడ్, మహ్మద్ వలీ పాషా, మహ్మద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



అనాథ యువకుడి చేరదీసిన సహృదయ అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకుడు మహ్మద్ చోటు

ముహూర్తాలు తీసుకొచ్చిన మాఘమాసం..!

రాయపర్తి, ఫిబ్రవరి 11 : ఏడాదిగా ప్రజలు ఎదురు చూస్తున్న మాఘమాసం వచ్చేసింది. ఆధ్యాత్మికతతో పాటు శుభకార్యాలను చేసే సమయాన్ని తీసుకొచ్చింది. ఈ మాసంలో అన్ని రోజులు మంచివేనని నమ్ము తారు. కాబట్టి ఇక శుభకార్యాలు జోరందుకోనున్నాయి. పంచమి నుంచి పెళ్లిళ్ల సీజన్ కూడా మొదలు కానుండడంతో అప్పుడే ప్రభుత్వ, ప్రైవేటు మండపాలు బుక్ చేసుకుంటున్నారు. అనేక పర్వదినాలు, శుభకార్యాలకు నెలవైన ఈ పవిత్ర మాఘమాసం శనివారం నుంచి ప్రారంభమైంది. పుష్య మాసంలో ఆగిన పనులన్నీ మాఘ మాసంలో పూర్తి చేయడానికి ఎవరికి వారే ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

• శుభకార్యాల సందడి

శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన మాసంగా మాఘమాసాన్ని పిలుస్తారు. పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, ఉపనయనాలు, అక్షరాభ్యాసం లాంటి అనేక శుభకార్యాలకు ఈ మాసం పెట్టింది పేరుగా ఉంటుంది. పుష్య మాసంలో ఆగిన పనులన్నీ మాఘ మాసంలో తిరిగి ప్రారంభించడానికి సిద్ధమవుతారు. శివుడితో పాటు సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఈ మాసం ప్రత్యేకత. నదీ స్నానాలు, ఉపవాస దీక్షలు, మాగపురనాణ పఠనం లాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కొనసాగుతాయి.

• పెళ్లిళ్ల సీజన్...

మాఘ మాసంలో పెళ్లిళ్లు చేయడం అత్యంత శుభప్రదమని ప్రజలు విశ్వసిస్తుంటారు. అందుకే ఈ మాసంలో ఏటా వేల సంఖ్యలో పెళ్లిళ్లు జరుగుతుంటాయి. ఈసారి కూడా జిల్లాలో భారీ సంఖ్యలో పెళ్లిళ్లు జరగనున్నాయి. మాఘ పంచమితో పెళ్లి సీజన్ ప్రారంభమవుతుందని పండితులు పేర్కొంటున్నారు. పెళ్లిళ్లతో పాటు బంగారం, వెండి ఆభరణాలు, భూమి కొనుగోళ్ల పై కూడా ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. ఈ నెల 13, 14, 17, 18, 24, 28, 29 తేదీల్లో వచ్చే మార్చిలో 2,3 తేదీల్లో జరగనున్నాయి. ఇక మాఘమాసం పూర్తయిన తర్వాత ఇదే మార్చి నెలలో పాల్గుణం ప్రారంభమై 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30 తేదీల్లో వచ్చే ఏప్రిల్‌లో 3,4 తేదీలు ఉన్నాయి. ఇదే ఏప్రిల్ నెలలో చైత్రం ప్రారంభమై 9, 18, 19, 20, 21, 22, 24, 26 తేదీలు ఉన్నాయని పండితులు చెపుతున్నారు. అనంతరం ఈ సంవత్సరం ఆగస్టు వరకు ముహూర్తాలు లేకపోవడంతో ఈ మూడు నెలల్లోనే ఎక్కువ సంఖ్యలో శుభకార్యాలు చేసుకునేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు.

• వసంత పంచమి...

మాఘమాసంలోవచ్చే ప్రముఖ పండుగ వసంత పంచమి.ఈసారి భక్తులు ఫిబ్రవరి 14న పర్వదినాన్ని జరుపుకోనున్నారు. సరస్వతి మాత పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ పండుగను జరుపుకుంటారు. ఈ రోజున చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించడం శుభప్రదంగా భావిస్తారు. అంతేకాకుండా ఉపనయాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తారు.

• రథసప్తమి...

సూర్య భగవానుడి జన్మదినంగా భావించే రథసప్తమి కూడా ఈ మాసంలోనే ఫిబ్రవరి 16న రానుంది. ఈ రోజున సూర్య దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

• భీష్మ ఏకాదశి

మహాభారత యుద్ధ సమయంలో వచ్చిన ఏకాదశి రోజున కఠోర దీక్ష చేపట్టిన భీష్ముడి పేరుతో భీష్మ ఏకాదశి వచ్చింది. ఇది ఈ నెల 20న రానుండడంతో ఆ రోజున వైష్ణవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

• మహా శివరాత్రి

మాఘమాసంలో వచ్చే అతి పెద్ద పండుగ మహా శివరాత్రి.ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలతో జరుపుకునే పండుగ. మాఘ త్రయోదశి మార్చి 8న శివరాత్రి పండుగ జరుపుకోనున్నారు.జిల్లాలోని అన్ని శివాలయాల్లో ఈ రోజున ప్రత్యేక పూజలు చేయడంతోపాటు గోదావరినదిలో ఈరోజు భక్తులు పెద్ద సంఖ్యలో స్నానాలు ఆచరిస్తారు. శివాలయాల్లో శివరాత్రి రోజున రుద్రాభిషేకాలు, బిల్వార్చన పూజలు పెద్ద ఎత్తున చేస్తారు.

అద్దె భవనాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు

ఆరోగ్య సిబ్బందికి భారమవుతున్న అద్దెలు

నెక్కొండ, ఫిబ్రవరి 11 : గ్రామీణ ప్రాంతంలో పేద ప్రజలకు వైద్య సేవలను మరింత అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో అరకొర వసతుల మధ్య ప్రజలకు వైద్య సేవలను అందిస్తున్నారు. అయితే ఈ భవనాలకు సంబంధించి అద్దెలు కూడా ప్రభుత్వం నెలనెలా చెల్లించకపోవడంతో ఆరోగ్య సిబ్బందికి అద్దెలు చెల్లించడం భారమవుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గ్రామాలకు దూరంగా ఉండటంతో రోగులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ప్రభుత్వం ఉప కేంద్రాలను ఏర్పాటు చేసింది. నెక్కొండ మండలంలోని నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో ఐదు, అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాల్లో నాలుగు ఆరోగ్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ ఉప కేంద్రాల నుంచి ప్రతీ రోజు వైద్య సిబ్బంది రోగులకు ప్రాథమిక వైద్య సేవలను అందించడంతో పాటు ప్రతి బుధవారం చిన్నారులకు రకరకాల టీకాలను (వ్యాక్సిన్‌లు) వేస్తుంటారు. కానీ, అద్దె భవనాలలో ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాలు అరకొర వసుతుల కారణంగా రోగులకు వైద్య సేవలు సిబ్బంది నామ మాత్రంగానే అందిస్తున్నారు. అద్దె భవనాల్లో విద్యుత్ సరఫరా ప్రధాన సమస్య కావడంతో ప్రభుత్వం రోగులకు వైద్య సేవలను అందించాలన్న ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాల నుంచి సంపూర్ణంగా వైద్య సేవలను అందించలేక పోతున్నామంటూ సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఆరోగ్య ఉప కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నెక్కొండ ప్రాథమిక వైద్య కేంద్రం పరిధిలో...

నెక్కొండ ప్రాథమిక వైద్య కేంద్రం పరిధిలోని నెక్కొండ, అప్పల్‌రావుపేట, రెడ్లవాడ, చంద్రుగొండ, దీక్షకుంట గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. నెక్కొండలో ప్రభుత్వ భవనం అయినప్పటికీ అంతగా వసతులు ఏర్పాటు చేయలేదు. అలాగే అప్పల్‌రావుపేటలో ఉప కేంద్ర భవనం నిర్మాణం చేసినప్పటికీ నిధుల కొరత కారణంగా అసంపూర్తి నిర్మాణంతో ఉపయోగ పడటం లేదు. రెడ్లవాడ, చంద్రుగొండ, దీక్షకుంట గ్రామాల్లో అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య ఏర్పాటు చేశారు.

అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో...

అలంకానిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తోపనపల్లి, నాగారం, పెద్ద కొర్పోలు, అలంకానిపేట గ్రామాల్లో ఆరోగ్య ఉప కేంద్రాలను ఏర్పాటు చేశారు. నాగారం గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్ర భవనం నిర్మాణం చేసినప్పటికీ ఈ భవనాన్ని సంబంధిత కాంట్రాక్టర్ తనకు బిల్లులు రాలేదన్న కారణంతో వైద్య శాఖకు భవనాన్ని అప్పగించలేదు. దీంతో ఈ గ్రామంలో ఉప కేంద్రాన్ని పాత జీపీ భవనంలో ఏర్పాటు చేయగా, ఆరోగ్య కేంద్ర భవనంలో ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనాన్ని ఏర్పాటు చేశారు. అలాగే తోపనపల్లిలో ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలికంగా ఉప కేంద్రాన్ని నడిపిస్తున్నారు. పెద్దకొర్పోలు గ్రామంలో అద్దె భవనంలో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

వైద్య సిబ్బందికి భారమవుతున్న అద్దెలు

మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉప కేంద్రాల అద్దెలను చెల్లించడం ఆయా గ్రామాల ఏఎన్ఎంలకు భారమవుతుంది. ఉప కేంద్రాల ఏర్పాటుకు భవనాలను నిర్మాణం చేసే వరకు ప్రభుత్వం ఆరు నెలలకు ఒకసారి కాకుండా నెలనెల అద్దెలు చెల్లించితే బాగుటుందని వైద్య సిబ్బంది అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అటు రోగుల, ఇటు వైద్య సిబ్బంది ఇబ్బందులను గుర్తించి ఉప కేంద్రం భవనాల నిర్మాణంచేయాలని వైద్య సిబ్బంది వైద్య ఆరోగ్య శాఖ అధికారులను కోరుతున్నారు.



చంద్రుగొండలో అద్దె భవనంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య ఉపకేంద్రం



అప్పల్‌రావుపేటలో అసంపూర్తిగా నిర్మాణంతో ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం



నాగారం ఆరోగ్య ఉప కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీ కార్యాలయం

అందరికీ ఉపయోగపడేలా బడ్జెట్



మాట్లాడుతున్న నరుకుడు వెంకటయ్య

వర్ధన్నపేట, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ ఉపయోగపడేలా జనరంజకంగా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరుకుడు వెంకటయ్య అన్నారు. ఆదివారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరుకుడు వెంకటయ్య మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆరు గ్యారెంటీలకు నిధులు కేటాయించి నిజాయతీ చూపించారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొలి బడ్జెట్ తెలంగాణ ఆర్థిక పునర్జీవనానికి పునాది వేసిందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అందరికీ మేలు చేసే విధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్లెపాక సమ్మయ్య, ఎస్సీ సెల్ టౌన్ అధ్యక్షుడు చేరుపెల్లి బాబు, మండల ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి కందిక ఎల్లస్వామి, నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకుడు దుబ్బ ఎల్లయ్య, బొడ్డు యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన వ్యాపారవేత్త

రాయపర్తి, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని ప్రముఖ వ్యాపారవేత్త, కాంగ్రెస్ నాయకుడు నంగునూరి అశోక్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య ప్రస్తుత రాజకీయ చర్చ జరిగింది.



నరేందర్‌రెడ్డిని కలిసిన అశోక్‌కుమార్

ఆత్మరక్షణకు కరాటే నేర్చుకోవాలి

• సినీ నటుడు సుమన్



కరాటే పోటీల సమావేశంలో మాట్లాడుతున్న సినీ నటుడు సుమన్

నర్సంపేట, ఫిబ్రవరి 11: మహిళలు, బాలికలు స్వీయరక్షణ, ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సినీ నటుడు సుమన్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని పద్మశాలిగార్డెన్‌లో ఆదివారం షుటోకాన్, ఇన్‌స్ట్రక్టర్, కరాటే మాస్టర్ రచ్చ శ్రీనుబాబు ఆధ్వర్యంలో జాతీయస్థాయి కరాటే చాంపియన్‌తిషిప్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ ప్రభుత్వాలు వచ్చినా మహిళలకు రక్షణ, భద్రత లేకుండాపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. చట్టాలు ఎన్ని ఉన్నా మహిళలు, బాలికలు కరాటే నేర్చుకోవడం ఎంతో అవసరమన్నారు. తనకు తాను స్వీయరక్షణ పొందడంతో పాటు ఆత్మరక్షణకు కరాటే దోహదపడుతుందన్నారు. కరాటే వల్ల ఆత్మరక్షణ, శరీరదారుఢ్యం, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. పాఠశాలలో పాఠ్యాంశంగా విద్యార్థినీ, విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. బయటకు పోయిన ఆడపిల్లలు ఇంటికి వచ్చేవరకు ఆందోళన, భయంతో గడిపే తల్లిదండ్రులు కరాటేపై పిల్లలకు ఆసక్తి కలిగించేలా ప్రోత్సహించి వారికి కరాటేలో శిక్షణ ఇప్పించాలని సూచించారు. విద్యతోపాటు స్వీయ రక్షణ కోసం కరాటేలో శిక్షణ పొందాలన్నారు. దేశంలో ఏ ప్రభుత్వాలు వచ్చినా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు రక్షణ, భద్రత కల్పించడం కోసం సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను వెలికి తీయడం కోసం కరాటే చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించే రచ్చ శ్రీనుబాబు, రచ్చ భవానిచంద్ వంటి కరాటే మాస్టర్లకు క్రీడాభిమానులు చేయూతనందించాలని కోరారు. సమావేశం అనంతరం సినీ నటుడు సుమన్‌తో పాటు పలువురు ప్రముఖులు, కరాటే మాస్టర్లను శ్రీనుబాబు, భవానిచంద్ సన్మానించి షీల్డులను అందజేశారు. కార్యక్రమంలో పట్టణంలోని అయ్యప్ప ఆలయ ట్రస్టు చైర్మెన్, మండల ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు శింగిరికొండ మాధవశంకర్, వ్యాపారవేత్త శ్రీరాం ఈశ్వరయ్య, కాంగ్రెస్ నాయకులు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, పెండెం రామానంద్, పాలాయి రవితో పాటు వివిధ జిల్లాలకు చెందిన కరాటే మాస్టర్లు, కరాటే విద్యార్థులు పాల్గొన్నారు.

ఏజెన్సీ గీత కార్మికులకు గుర్తింపు కార్డులు అందించాలి

ఏజెన్సీ ప్రాంతాల్లోని గీత కార్మికులకు గుర్తింపు కార్డులను ఎక్సైజ్ శాఖ అందించాలని సినీ నటుడు సుమన్ అన్నారు. నర్సంపేటలోని సర్వాపురం, ద్వారకపేట గౌడసంఘాల ఆధ్వర్యంలో రేణుక ఎల్లమ్మ ఆలయంలో కంఠమేశ్వరుని ఉత్సవాలను ఆదివారం ఆయన ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో గౌడ వృత్తిని నిర్వీర్యం చేసేందుకు ఇతర కులస్థులు తాటిచెట్లు ఎక్కుతున్నారని ఆయన పేర్కొన్నారు. గుర్తింపు కార్డులు లేకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం, ఎక్స్‌గ్రేషియా, సంక్షేమ పథకాలు లభించడం లేదన్నారు. రేణుక ఎల్లమ్మ తల్లి ఉత్సవాలు మన సంస్కృతికి అద్దంపడుతాయని ఆయన అన్నారు. అనంతరం సుమన్‌ను సంఘం నాయకులు బొకే అందజేసి శాలుతో సన్మానించారు. కార్యక్రమంలో గౌడ జన హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రసిడెంట్ అనంతుల రమేశ్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకటేశ్వర్లు, గౌడ సంఘం అధ్యక్షుడు శీలం వీరన్న, రాష్ట్ర ప్రచార కార్యదర్శి గొడిశాల సదానందం, గంప రాజేశ్వర్, మచ్చిక రాజు, రామగోని సుధాకర్, మద్దెల సాంబయ్య, కల్లెపు వెంకట్, రాము, గందసిరి సామ్రాజ్యం పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ మంత్రి

రాయపర్తి, ఫిబ్రవరి 11 : మండలంలోని సన్నూరు గ్రామంలోని వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణ పనులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పరిశీలించారు. ఆదివారం గ్రామంలోని ఆలయాన్ని సందర్శించి పనుల ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన సుమారు రూ.15కోట్ల విలువతో కూడిన పనుల పురోభివృద్ధిపై ఆయన వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ హయాంలో చేపట్టిన పనులను వేగవంతం చేయాలని సూచించారు. పదవులు శాశ్వతం కాదని, పదవులు లేకున్నప్పటికీ ఆలయాన్ని నిర్మించాలని నిర్ణయించినట్లు చెప్పారు. పురాతనకాలం నాటి ఆలయ పునరుద్ధరణకు నిధులు మంజూరు చేయించినట్లు మాజీ మంత్రి ఎర్రబెల్లి చెప్పారు. ప్రజలకోసం పని చేయాలని పాలన సాగించినట్లు చెప్పారు. హిందూ దేవాలయాల పునరుద్ధరణలో తమ ప్రభుత్వ ప్రత్యేక దృష్టిపెట్టి ఆలయాలను పలు చోట్ల నిర్మించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ జీనుగు అనిమిరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్‌లు యాకమ్మ, నలమాస సారయ్యగౌడ్, ఎంపీటీసీ గోవింద్‌నాయక్, పార్టీ ప్రధాన కార్యదర్శి కూస మధు, నాయకులు సంతోష్‌గౌడ్, సునీతయాకూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి

కరాటే పోటీల్లో మినీ స్టేడియం విద్యార్థుల ప్రతిభ

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 11: ములుగు జిల్లా ఏటూర్ నాగారం లోని గిరిజన భవన్‌లో సూర్య షోటోకాన్ కరాటే అకాడమి ఆధ్వ ర్యంలో ఆదివారం నిర్వహించిన కరాటే ఛాంపియన్‌షిప్ - 2024 పోటీల్లో నర్సంపేట మినీస్టేడియం విద్యార్థులు పాల్గొని పతకాలు సాధించి ప్రతిభను చాటారు. కటా పోటీలో 18 సంవత్సరాల బాలికల విభాగంలో జి.సమత, ఎ.సాహితి బంగారు పతకాలు సాధించినట్లు మినీ స్టేడియం కరాటే కోచ్ మాస్టర్ షేక్ జానీ తెలిపారు. 12 సంవత్సరాల బాలుర విభాగం కటా పోటీలో సిహెచ్. ఆకాష్ బంగారు పతకం, 14 సంవత్సరాల విభాగంలో కె.రిత్విక్‌చంద్ర, ఎం. విఘ్నేశ్వర చారి, డి.అర్జున్‌చంద్ర, కె. సాన్విత్ రిషి, ఎ. పునీత్‌సాయిలు వెండి పతకాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభను చాటిన విద్యార్థులను మాస్టర్ జానీతో పాటు పలువురు అభినందించారు.



పతకాలు సాధించిన మినీ స్టేడియం విద్యార్థులు

గ్యాస్ లబ్ధిదారుల జాబితా పరిశీలన

చెన్నారావుపేట, ఫిబ్రవరి 11 : మండలంలోని కోనాపురం, ఉప్పరపల్లితో పాటు పలు గ్రామాల్లోని గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో ప్రభుత్వం అందించే రూ.500లకు గ్యాస్ లబ్ధిదారుల అర్హుల జాబితాను ఆదివారం అధికారులు పరిశీలించారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో భారతి మాట్లాడుతూ గ్రామాల్లో గ్యాస్ ఉన్న లబ్ధిదారులకు పత్రాలను, నెంబర్‌లను సరిచేయటం జరిగింది. తప్పులుగా ఉన్న వివరాలను సరిచేస్తూ అర్హుల వివరాలను గుర్తించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారందరూ సబ్సిడీ గ్యాస్‌కు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రాజు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలను నమ్మరాదు

చెన్నారావుపేట, ఫిబ్రవరి 11: గ్రామాల్లోని ప్రజలు మూఢ నమ్మకాలను నమ్మరాదని నెక్కొండ సర్కిల్ సీఐ చంద్రమోహన్ అన్నారు. శనివారం మండలంలోని కోనాపురం గ్రామంలో జాగృతి కళాజాత వారి ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. టోల్ ఫ్రీ నెంబర్ 1930 నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

నల్లబెల్లి, ఫిబ్రవరి 11 : మండలంలోని రుద్రగూడెం కాకతీయ బ్రిలియంట్ స్టార్స్ విద్యాలయంలో ఆదివారం 2003-04 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులకు నమస్కారాలు తెలియజేసి, శాలువలతో సన్మానించారు. ప్రస్తుతం ఎవరెవరేమి చేస్తున్నారో ఉపాధ్యాయులకు తెలియజేశారు. ఈ బ్యాచ్‌లో ఎవరికి ఏలాంటి ఆపద వచ్చినా తప్పకుండా అందరం సహాయసహకారాలు చేసుకుంటామని తెలిపారు. సమ్మేళనంలో ఉపాధ్యాయులు పోసుగొటి రామారావు, మేడ వరప్రసాద్ కమలాకర్‌రావు, గాదె రాజిరెడ్డి, ఎండీ రాయబోస్, రఘుపతి, అంకుష్, విద్యార్థులు ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలు తీర్చాలి

• వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 11 : ప్రభుత్వ అధికారుల పాలనలో గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను తీర్చి సుపరిపాలన అందించాలని వర్ధన్నపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి కోరారు. ఆదివారం దమ్మన్నపేట గ్రామంలో గ్రామ ప్రత్యేక అధికారి ఏపీవో ధనలక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీలో ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. గ్రామాల్లో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే తీర్చాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఎమ్మెల్యే సీడీఎఫ్‌ను గ్రామాల అభివృద్ధికి వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలు దశలవారీగా అందించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని అన్నారు. ఐదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన ఘన చరిత్ర వారికుందన్నారు. ప్రభుత్వ ఖజానా ఖాళీచేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేయడం సిగ్గుచేటన్నారు.

బీఎన్‌కేఎస్‌లో కొత్త సభ్యులకు అవకాశం కల్పించాలి

వర్ధన్నపేట, ఫిబ్రవరి 11 : భారతీయ నాటక కళా సమితి (బీఎన్‌కేఎస్) గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నందున కమిటీలోని సభ్యులతోపాటు, అనుభవం ఉన్న కొత్తవారిని చేర్చుకోవాలని రిటైర్డ్ ఎంఈవో హన్మకొండ సుధాకర్ సూచించారు. అలాగే కళా సమితి అభివృద్ధికి వివిధ గ్రామాల నుంచి నాటికలపై అనుభవమున్న వారిని సైతం ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసుకోవడం సమంజసంగా ఉంటుందన్నారు. ఇప్పుడున్న శాశ్వత దాతలతో పాటు కొత్త వారిని చేర్పించి కళా సమితి నిర్వహణకు సయన్వ యంతో పని చేయాలన్నారు. భారతీయ నాటక కళా సమితి వర్ధన్నపేట అధ్యక్షుడు, నిర్వాహకులు ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకోవాలన్నారు.

చేతి పంపును సద్వినియోగం చేసుకోవాలి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 11 : రానున్న వేసవి కాలంలో చేతి పంపును సద్వినియోగం చేసుకోవాలని చీర్స్ పౌండేషన్ వ్యవస్థాపకుడు బత్తిని అశోక్‌గౌడ్ అన్నారు ఆదివారం మండలంలోని ఎల్లాయిగూడెం గ్రామంలో హైదరాబాద్ చీర్స్ ఫౌండేషన్స్ వారి ఆధ్వర్యంలో చేతి పంపును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చడానికి చేతి పంపులు ఉపయోగపడుతాయన్నారు.ఈ కార్యక్రమంలో శ్రీకాంత్ , రాజేష్, ఆకుల అశోక్, మాజీ సర్పంచ్ జయ జనార్ధన్, విజయ్‌కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బాల సంస్కార్‌తో విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపు

పర్వతగిరి, ఫిబ్రవరి 11: బాల సంస్కార్‌తో విద్యార్థులకు నైతిక విలువలు పెరిగి ఒక సమగ్ర లక్ష్యం ఏర్పడుతుందని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు చింతపట్ల సురేందర్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో శ్రీరామకృష్ణ సేవా సమితి సమక్షంలో విద్యార్థులకు బాల సంస్కార్ ప్రారంభమైందని, ఇకనుంచి ప్రతీ ఆదివారం ఉద యం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ బాల సంస్కార్ ప్రోగ్రామ్ విద్యార్థుల కోసం జరుగుతుందని శ్రీరామకృష్ణ సేవా సమితి బాధ్యుడు జంగ ప్రసాద్ తెలిపారు. అనంతరం కంటెం సంతోష్ విద్యార్థులకు బాల సంస్కార్ ప్రోగ్రామ్‌లో స్వామి వివేకానంద గొప్పతనాన్ని తెలియజేశారు. ఈ ప్రోగ్రామ్‌లో విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ పర్వతగిరి చిదురాల వేణుగోపాల్ ఆధ్వర్యంలో పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి బాధ్యులు ఉపాధ్యాయులు రమేష్, వివేక్, రణధీర్, చిదరాల సంధ్య, భిక్షపతి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నర్సంపేట, ఫిబ్రవరి 11 : గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పోరాడేది తెలంగాణ గీత కార్మిక సంఘమని వృత్తిదారుల సంఘం బాధ్యులు పంజాల రమేశ్, జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి తిరుపతిగౌడ్ అన్నారు. పట్టణంలోని ద్వారకపేట రోడ్‌లోని గీత కార్మికుల అడ్డా వద్ద సంఘం నూతన క్యాలెండర్లను ఆదివారం ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గీత కార్మికులకు రూ.5 వేల వంతును పెన్షన్, ఇల్లులేని పేదలకు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా ఇండ్లు మంజూరి చేయాలన్నారు. ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి కిందపడి గాయపడిన కార్మికులకు అన్ని రకాల వైద్య సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గీత కార్మికులకు వర్తింప జేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలకుర్తి కృష్ణగౌడ్, గోపగాని శంకర్, రవి, వెంకటేష్, సాంబయ్య, వృత్తిదారుల సంఘం నాయకులు మియాపురం గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దుగ్గొండి సర్కిల్ సీఐగా శ్రీనివాస్ బాధ్యతల స్వీకరణ

దుగ్గొండి, ఫిబ్రవరి 11 : దుగ్గొండి సర్కిల్ సీఐగా ఇ.శ్రీనివాస్ బాధ్యతలు ఆదివారం స్వీకరించారు. దుగ్గొండి సీఐగా పని చేసిన పుల్యాల కిషన్ బదిలీపై ఏనుమాములకు బదిలీ కాగా, మహబూబాబాద్ సీఐగా పని చేసిన ఇ.శ్రీనివాస్ బదిలీపై వచ్చి బాధ్యతలు స్వీకరించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు పని చేయడం జరుగుతుందని, ప్రజలు, సహకరించాలన్నారు.



పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పర్వతగిరి, ఫిబ్రవరి 11 : మండల కేంద్రంలోని పర్వతగిరి ప్రభుత్వ హై స్కూల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. 2004-05 విద్యా సంవత్సర పదో తరగతి విద్యార్థులు అపూర్వమైన కలయికతో ఒకరినొకరు పలకరించుకుంటూ ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు.గురువులకు ధన్యవాదాలు తెలియజేసి, శాలువలతో సన్మానించారు. అనంతరం స్కూల్‌కు అవసరమైన బ్యాటరీ, చార్జర్‌ను అందజేశారు. ఈ సమ్మేళనంలో రామబ్రహ్మాచారి, పాక రమేష్, ఉషశ్రీ, సునీత, విద్యాసాగర్, సారంగపాణి, శేఖర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.